క్లుప్తంగా

వన్‌టౌన్ సీఐగా సుధాకర్‌రెడ్డి



బొమ్మలసత్రం: నంద్యాల పట్టణ వన్‌టౌన్ సీఐగా సుధాకర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో ప్యాపిలి, నందికొట్కూరులో సీఐగా పనిచేశారు. వన్‌టౌన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని సీఐ తెలిపారు. ప్రజలు ఏవైనా సమస్యలు ఉంటే తమను నేరుగా కలిసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. నాటుసారా, గుట్కా విక్రయాలు, పేకాట, మట్కా నిర్వాహకులు, దౌర్జన్యాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

రాయల పాలన ఆదర్శం



ఉయ్యాలవాడలో శ్రీకృష్ణదేవరాయుల విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ: శ్రీకృష్ణ దేవరాయల పాలన ఎన్నటికీ ఆదర్శమని బలిజ సంఘం మండలాధ్యక్షుడు ఆకుల వెంకటసుబ్బయ్య, కోశాధికారి అర్జిగారి నరసింహులు కొనియాడారు. బుధవారం శ్రీకృష్ణ దేవరాయ పట్టాభిషేక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కమతం వీధిలో ఏర్పాటు చేసిన రాయల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు జింకా వెంకటస్వామి, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు ఆకుల వెంకటసుబ్బయ్య, చిన్నరాముడు, కొండయ్య, శ్రీనివాసులు, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



రెవెన్యూ సిబ్బందితో సమావేశమైన తహసీల్దార్ మల్లికార్జునరావు

రుద్రవరం: మండల తహసీల్దారుగా మల్లికార్జునరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు రెవెన్యూ సిబ్బంది అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన డిప్యూటీ తహసీల్దారు రవీంద్ర ప్రసాద్, వీఆర్వోలతో సమావేశం నిర్వహించి పరిచయ కార్యక్రమం చేపట్టారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. గతంలో తాను ఇక్కడ ఆర్ఐగా, డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించడంతో రుద్రవరం మండలంపై అవగాహన ఉందన్నారు. ఇక్కడి భూ సమస్యలు, ఇతర రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.

శ్రీరంగాపురానికి బస్సు సర్వీసు



శ్రీరంగాపురంలో ఆర్టీసీ బస్సుకు పూజలు చేస్తున్న సర్పంచ్

రుద్రవరం: నంద్యాల ఆర్టీసీ డిపో నుంచి రుద్రవరం మండలం శ్రీరంగాపురం గ్రామానికి కొత్తగా ఓ బస్సును నడుపుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం మొదటిసారి ఆ బస్సు గ్రామంలోకి రావడంతో ప్రజలు సంతోషించారు. గ్రామ సర్పంచ్ నంద్యాల సుబ్బమ్మ బస్సుకు పూజలు చేశారు. నంద్యాల నుంచి శ్రీరంగాపురానికి బస్సు నడపడం వల్ల ఎల్లావత్తుల, కోటకొండ కొత్తూరు, మహదేవపురం తదితర గ్రామాల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

యువకుడికి కత్తిపోటు



చికిత్స పొందుతున్న వెంకటసుబ్బయ్య

బొమ్మలసత్రం: మద్యం మత్తులో యువకుడిపై కత్తితో దాడి చేసి ఘటన నంద్యాల రెవెన్యూ క్వార్టర్స్‌లో చోటుచేసుకుంది. వివరాలు.. రెవెన్యూ క్వార్టర్స్‌కు చెందిన వెంకటసుబ్బయ్య టెక్కె వీధిలో మెకానిక్ షెడ్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి మెకానిక్ షెడ్డు నుంచి ఇంటికి వచ్చిన వెంటసుబ్బయ్యను అదే వీధికి చెందిన సాయి పనిపై బైయటకు తీసుకెళ్లాడు. ఇంటి సమీపంలో మద్యం మత్తులో ఉన్న సాయి తన వద్ద ఉన్న కత్తితో వెంకటసుబ్బయ్యను పొత్తి కడుపులో పొడిచాడు. అతను కేకలు వేయడంతో స్థానికులు సాయిని మందలించి అక్కడి నుంచి పంపించారు. రక్తస్రావంతో ఉన్న వెంకటసుబ్బయ్యను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకట సుబ్బయ్య అవుట్‌పోస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నేడు సామాజిక తనిఖీ ప్రజా వేదిక

నంద్యాల(అర్బన్): స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గురువారం ఎన్ఆర్ఈజీఎస్ 18వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సౌభాగ్యం తెలిపారు. మండలంలోని 17 పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులపై ప్రజా వేదిక ఏర్పాటు చేశామన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

వానొస్తే గండమే!

- శిరివెళ్ల- రుద్రవరం మార్గంలో మూడు వాగులు
- వర్షాకాలంలో ఉధృతంగా నీటి ప్రవాహం
- లో లెవల్ వంతెనలపై నీరు చేరడంతో నిలిచిపోతున్న రాకపోకలు
- స్తంభిస్తున్న జనజీవనం
- సరైన ఎత్తులో వంతెనలు నిర్మించాలని డిమాండ్



వక్కిలేరు వాగుపై లోలెవల్ వంతెన



ఉధృతంగా ప్రవహిస్తున్న వక్కిలేరు వాగు (ఫైల్)

శిరివెళ్ల: వర్షాకాలం వస్తే పొంగిపొర్లే వాగులతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. వాగులపై లోలెవల్ వంతెనలు ఉండడంతో వర్షపు నీరు ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలు నిలిచిపోయి జన జీవనం స్తంభిస్తుంది. ప్రభుత్వాలు మారుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదు. శిరివెళ్ల- రుద్రవరం ఆర్అండ్‌బీ రోడ్డుపై మూడు వాగులున్నాయి. శిరివెళ్లకు ఆనుకొని వక్కిలేరు వాగు, తర్వాత మాల వాగు, కోడిపిల్ల వాగులున్నాయి. అందులో వక్కిలేరువాగు, మాల వాగుపై లో లెవల్ వంతెనలు ఉన్నాయి. వాగులపై కేవలం 3 నుంచి 4 అడుగుల ఎత్తులో ఈ బ్రిడ్జిలున్నాయి. దీంతో వర్షాకాలంలో వాగులు పొంగి బ్రిడ్జిలపై నడుము లోతు వరకు నీరు ప్రవహిస్తుంది. నీరు వచ్చినప్పుడు రవాణా స్తంభించిపోతుంది. వాగులు పొంగి బస్సులు, మోటార్ బైక్‌లు, ట్రాక్టర్లు, లారీలు వరదలో చిక్కుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. నంద్యాల నుంచి రుద్రవరం వెళ్లి తిరిగి బస్సు వచ్చేలోపు వాగు ఉప్పొంగిన సందర్భాలున్నాయి.

మూడేళ్ల క్రితం కాదరబాదరకు చెందిన బండారు నడిపి వెంకటేశ్వర్లు సాయంత్రం గ్రామం నుంచి సరుకుల కోసం శిరివెళ్లకు బయలుదేరాడు. ఆ సమయంలో వాగులో అంతగా ప్రవాహం లేదు. రాత్రి తిరిగి వస్తుండగా వాగు పొంగి పొర్లి బ్రిడ్జిపై నడుము లోతు వరకు నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. వ్యక్తి అతి కష్టం మీద బ్రిడ్జి దాటుతుండంగా ప్రమాదవశాత్తు వాగులో కొట్టుకొపోయాడు. రాత్రికి ఇంటికి రాకపోయే సరికి బంధువులు, గ్రామస్తులు వాగు వద్దకు వచ్చి గాలించారు. ఆ రోజు ఫలితం లేదు. వాగు ఉధృతికి దాదాపు 8 కిలోమీటర్లు కొట్టుకుపోయి రుద్రవరం మండలం యర్రగుడిదిన్నె వద్ద మూడు రోజుల తర్వాత మృతదేహం కనిపించింది. రైతులు తమ పొలాలకు వెళ్లాలంటే కూడా రెండు వాగులు దాటాలి. వారి పరిస్థితి మరింత ఇబ్బందిగా ఉంటుంది. వాగులో నీటి ఉధృతి తగ్గాలంటే రెండు, మూడు రోజులు పడుతుంది. అంతవరకు రైతులు ఇళ్ల దగ్గరే ఉండిపోతున్నారు. అలా వర్షాకాలంలో మూడు నెలల పాటు ఇబ్బందులే. సమస్య పరిష్కారానికి హై లెవల్ బ్రిడ్జిలు నిర్మించాలని ప్రభుత్వాలకు అధికారులు ప్రతిపాదనలకు పంపడం రివాజుగా మారింది.

ప్రతిపాదనలు పంపాం

శిరివెళ్ల- రుద్రవరం రస్తాలో ఉన్న రెండు వాగులపై హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణాలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. న్యూడెవలప్ మెంట్ రోడ్ల పథకం కింద నిధులు మంజూరు కాగానే టెండర్లు వేసి పనులు మొదలు పెడతాం.

– సుబ్బయ్య, డీఈ, ఆర్అండ్‌బీ

పొలాలకు వెళ్లాలంటే వాగు దాటాలి



మా గ్రామంలోని రైతులకు మాల వాగు అవతల పొలాలున్నాయి. వానా కాలం వచ్చిందంటే వాగు, వరదలే గుర్తుకు వస్తాయి. వరి, జొన్న పంటల సాగు వానాకాలంలోనే మొదలవుతుంది. నాట్లు వేయాలి, కూలీలు పొలాలకు వెళ్లాలి. పెద్ద వర్షం పడితే వాగుపై ఉన్న బ్రిడ్జిపై నడుము లోతు వరకు నీళ్లు ఉంటాయి. దాటలేక పోతున్నాము. వరద తగ్గడానికి రెండు, మూడు రోజులు పడుతుంది. అప్పటివరకు పనులు బందే. వాగుపై సరైన ఎత్తులో బ్రిడ్జి నిర్మిస్తే అందరికీ మేలు జరుగుతుంది.

– తిరుపాలరెడ్డి, కాదరబాదర గ్రామం

కాదరబాదరలో స్థలాలు, ఇళ్లు ఇచ్చారు



మాది శిరివెళ్ల. మా ఊరిలో స్థలాలు లేకపోవడంతో కాదరబాదరలో దాదాపు 500 మందికి ఇంటి స్థలాలు ఇచ్చారు. ఇళ్లు కూడ కట్టుకుంటున్నాం. మా ఊరికి కాదరబాదరకు మధ్య వక్కిలేరు వాగు ఉంది. ప్రతి పనికి శిరివెళ్లకు రావాల్సి ఉంటుంది. వర్షాకాలం వస్తే వాగు ఉప్పొంగుతుంది. ప్రతి పనికి ఇబ్బందే. అందరం ఇళ్లు నిర్మించుకుని అక్కడ చేరితే మాకు వాగు కష్టాలు తప్పవు. వాగుపై బ్రిడ్జి నిర్మించి సమస్య పరిష్కరించాలి. – నబిరసూల్, శిరివెళ్ల

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయండి

శిరివెళ్ల: డిసెంబర్ నెలాఖరులోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ నాగేశ్వర్ సూచించారు. ఆయన బుధవారం ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఉపాధి పథకం సిబ్బంది, సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను యథాతథంగా కొనసాగించాలని ప్రస్తుత ప్రభుత్వం ఆదేశించిందన్నారు. మండలానికి 1543 ఇళ్లు మంజూరు కాగా ఇంకా 420 ఇళ్ల నిర్మాణాలు పునాది దశలోనే ఉన్నాయన్నారు. లబ్ధిదారులను కలిసి ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. అలాగే పూర్తయిన ఇళ్లకు ఉపాధి హామీ పథకం కింద 100 రోజుల పనిదినాలకు ఇచ్చే సహాయం కోసం మస్టర్లను నమోదు చేయాలన్నారు. ఇంతవరకు 95 శాతం మస్టర్లు పూర్తి చేశారని, మిగిలిన 5 శాతం మస్టర్లు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమీక్షలో ఉపాధి ఏపీఓ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ ఓ ప్రకటనలో తెలిపారు. జువాలజీలో 55 శాతం మార్కులతో పీజీ చేసిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఏపీ సెట్, నీట్, పీహెచ్‌డీ కలిగి అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. సర్టిఫికెట్లతో ఈ నెల 9వ తేదీలోగా కళాశాలలో సంప్రదించాలని సూచించారు. ఈనెల 12వ తేదీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం



తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న జెడ్పీటీసీ శకుంతల



తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు



గర్భిణికి పండ్లు అందజేస్తున్న వైద్యులు

దొర్నిపాడు: చిన్నారులకు తల్లిపాలు పడితేనే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని జెడ్పీటీసీ శకుంతల అన్నారు. తల్లి పాల వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీడీపీఓ తేజశ్వరీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలకు ఆరు నెలల వరకు తల్లి పాలు మాత్రమే పట్టించాలన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలను తప్పనిసరిగా తాగించాలన్నారు. బాలింతలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ, పీహెచ్ఎం భాగ్యమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ సాయికృప, ఏపీఎం బాబు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డ ఆరోగ్యానికి రక్ష

నంద్యాల(వ్యవసాయం): బిడ్డ ఆరోగ్యానికి తల్లిపాలు రక్షణగా నిలుస్తుందని డాక్టర్ వసుధా రాణి అన్నారు. బుధవారం ఆత్మకూరు అర్బన్ హెల్త్ సెంటర్‌లో తల్లిపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాల విశిష్టత, పాలు పట్టే విధానం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. తల్లులకు బ్రెడ్లు, పండ్లు, బేబీ కిట్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు మాదవి, నర్మద, నాగమణి, అరుణకుమారి, సునీత, శిల్పా, క్రిష్ణవేణి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల(అర్బన్): ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఈనెల 1 నుంచి 7వ తేదీ వరకు వారం రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లి పాల వారోత్సవాలు ముగిశాయి. పట్టణం, గ్రామాల్లో తల్లిపాల విశిష్టతపై అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మాతాశిశు మరణాలు గణనీయంగా తగ్గించడం, బిడ్డల సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలే శ్రేయస్కరమని ప్రచారం చేశారు. బుధవారం పట్టణంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉన్న అర్బన్‌హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్లు నాగమణి, ధనలక్ష్మి మాట్లాడుతూ.. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, పాలలో ఖనిజాలు, మాంస కృతులు ప్రోటీన్లు పుష్కలంగా ఉంటాయన్నారు. ముర్రుపాలు బిడ్డకు వ్యాధి నిరోధక టీకాగా పని చేస్తుందని తెలిపారు. వైద్యులు అరుణకుమారి, రజిని, ఫిరోజ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నజీరా, సుజాత, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం లోపిస్తే చర్యలు



వర్మీకంపోస్టు ఎరువును పరిశీలిస్తున్న డీపీఓ

నంద్యాల(అర్బన్): పల్లెల్లో పారిశుద్ధ్యం లోపిస్తే చర్యలు తప్పవని డీపీఓ మంజులవాణి హెచ్చరించారు. వాతావరణంలో మార్పులకు అనుగుణంగా పారిశుద్ధ్య విషయంలో పంచాయతీ సిబ్బంది పనులు నిర్వహించాలన్నారు. మండలంలోని భీమవరం గ్రామంలో బుధవారం చెత్త సంపద కేంద్రం, పీహెచ్‌సీ సబ్‌సెంటర్, ఎంపీయూపీ పాఠశాలను ఆమె పరిశీలించారు. మురుగు నిల్వలకు వర్షపునీరు తోడవడంతో దోమలు వృద్ధి చెందుతాయన్నారు. పారిశుద్ధ్య పనులు చేపట్టి ప్రజారోగ్యాన్ని కాపాడాలన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



అంజనమ్మతో మాట్లాడుతున్న పులికొండన్న

నంద్యాల(అర్బన్): అంధురాలైన గడివేముల వీఆర్ఏ అంజనమ్మను వేధించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న కోరారు. అంధుల కోటాలో 2014లో వీఆర్ఏగా విధుల్లో చేరిన అంజనమ్మను తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్, అటెండర్లు వెట్టిచాకిరీ చేయిస్తూ మానసిక వేధింపులకు గురి చేస్తున్నారు. బుధవారం ఎంవీఆర్‌పీఎస్ నాయకులు అంజనమ్మను కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పులికొండన్న మాట్లాడుతూ.. అంజనమ్మ విధులకు పనికిరావంటూ వేధించిన వారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. వాల్మీకి సేవా సమితి అధ్యక్షుడు తలారి కృష్ణ, వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు శేఖర్, భారతి, రమణ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలను ఆదరించాలి



చేనేత వస్త్రధారణ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

నంద్యాల(వ్యవవసాయం): చేనేత వస్త్రాలను ప్రతి ఒక్కరూ వాడి చేనేత పరిశ్రమకు తోడ్పడాలని బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు బత్తిన స్వాతి పేర్కొన్నారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎస్పీవైరెడ్డి డిగ్రీ కళాశాలలో చేనేత వస్త్రాలపై అవగాహన కార్యక్రమం, చేనేత వస్త్రాధారణ పోటీలు నిర్వహించారు. చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి నేతన్నల ఆర్థికాభివృద్ధికి సహకరించాలని కోరారు. అరుణ, మధుర, సుజిత, చంద్రలేఖ, రజియా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో మౌనం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న రంగనాయుడు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో జరుగుతున్న దోపిడీలు, దొంగతనాలు, హత్యలు, అసాంఘిక కార్యక్రమాలపై జిల్లా ఉన్నాతాధికారులు మౌనం వీడి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణలో అధికారులు కఠినంగా వ్యవహరించాలని కోరారు. జిల్లా ప్రజలు ప్రశాంతంగా ఉండే విధంగా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

ట్రాక్టర్ అదుపుతప్పి యువకుడి దుర్మరణం

రుద్రవరం: మండల పరిధిలోని ముకుందాపురం గ్రామానికి చెందిన లక్ష్మీనరసయ్య (26) అనే యువకుడు బుధవారం ట్రాక్టర్ అదుపుతప్పిన ప్రమాదంలో మృతి చెందాడు. ఎస్ఐ భూపాల్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. సొంత పొలంలో వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టర్‌తో వెళ్లిన లక్ష్మీనరసయ్య ఇంటికి తిరిగివస్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. ట్రాక్టర్ నడుపుతున్న లక్ష్మీనరసయ్య కింద పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు తండ్రి భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతుడికి వివాహం కాలేదు.

రేపు జాబ్ మేళా

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శుక్రవారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో మెయిల్ మిషన్ ఆపరేటర్ ఉద్యోగానికి జాబ్ మేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 18 ఏళ్ల నుంచి 32 ఏళ్ల మధ్య వయస్సు ఉండి డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో, బీటెక్, మెకానికల్ చదివిన అభ్యర్థులు ఉద్యోగ మేళాలో పాల్గొనవచ్చన్నారు. విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలు, ఫొటోలతో హాజరు కావాలన్నారు.

450 ప్యాకెట్ల రేషన్ బియ్యం పట్టివేత

ఆళ్లగడ్డ: పట్టణ శివారులో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ సీఐ కేశవరెడ్డి బుధవారం తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. ఓ గోదాములో నిల్వ ఉంచేందుకు తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. 450 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న రుద్రవరం మండలం ముత్తలూరు గ్రామానికి చెందిన ప్రహ్లాదుడును అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు పట్టణ ఎస్ఐ నగీన కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

అధికారుల నిర్ణయం మేరకే ఏరువాక కేంద్రం మార్పు

నంద్యాల(అర్బన్): ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ అధికారుల నిర్ణయం మేరకే నంద్యాలలోని ఏరువాక కేంద్రాన్ని కర్నూలు జిల్లాకు మార్చడం జరిగిందని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ రామచంద్రారావు బుధవారం ఒక ప్రటనలో తెలిపారు. 1998 నుంచి 2022 వరకు దాదాపు 24 సంవత్సరాలు కర్నూలు జిల్లా రైతులకు ఏరువాక కేంద్రం సేవలు అందించిందన్నారు. నంద్యాల జిల్లా రైతులకు సేవలు అందించేందుకు 2022లో కర్నూలులోని ఏరువాక కేంద్రాన్ని నంద్యాల జిల్లాకు తరలించారని, దీంతో కర్నూలు జిల్లాలోని రైతులు పంటల్లో వస్తున్న సమస్యలు, ఆధునిక వ్యవసాయ పద్ధతుల సాగులో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏరువాక కేంద్రం మార్పును రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో జియారత్ వేడుకలు



ఉయ్యాలవాడలో దస్తగిరి స్వామి, మౌలాలి స్వామి పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ: మండల కేంద్రంలో దస్తగిరి, మౌలాలి స్వామి పీర్ల జార్తల వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి అనంతరం జార్తలు ప్రారంభమై బుధవారం సాయంత్రం ముగిశాయి. ఏటా మొహర్రం అనంతరం 21 రోజుల తరువాత జియారత్ వేడుకలు నిర్వహించడం గ్రామ ఆనవాయితీ. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక ఫాతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు అత్యంత వైభవంగా పీర్లకు గ్రామోత్సవం నిర్వహించారు.

నూతన చట్టాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జడ్జి ఆదినారాయణ

నంద్యాల(వ్యవసాయం): మండలన్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నూతన చట్టాలపై రామకృష్ణ పీజీ కళాశాల విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ మాట్లాడుతూ.. నూతనంగా తీసుకొచ్చిన చట్టం ద్వారా ఏ పోలీస్‌స్టేషన్ నుంచైనా జీరో ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు త్రిబుల్ రైడింగ్ చేయరాదని, హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని సూచించారు. యువత చెడుఅలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కళాశాల డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ శ్రావణి, మోహన్‌రావు పాల్గొన్నారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం

- గ్రామైక్య సంఘాల మార్పుపై ఏపీఎంను ప్రశ్నించిన ఎంపీపీ, సర్పంచ్‌లు
- సమాధానం చెప్పలేక వెళ్లిపోయిన ఏపీఎం



మాట్లాడుతున్న ఎంపీపీ



ఏపీఎంను ప్రశ్నిస్తున్న సర్పంచ్, ఎంపీపీ

గోస్పాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. ఎంపీపీ ఆర్థర్ సైమాన్ అధ్యక్షతన సభ ప్రారంభమైంది. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయాశాఖల వారీగా అభివృద్ధి పనులపై చర్చించారు. అందులో భాగంగా ఏపీఎం రామశేఖర్‌రెడ్డి ఐకేపీ శాఖ ద్వారా పొదుపు మహిళలకు అందిస్తున్న సేవలపై మాట్లాడుతుండగా.. కలగచేసుకున్న ఎంపీపీ, సాంబవరం సర్పంచ్ ఐజయ్య గ్రామైక్య సంఘాలకు చెందిన లీడర్లను వారికి తెలియకుండానే మార్పుచేసే చర్యలు చేస్తున్నారంటూ ఏపీఎంను ప్రశ్నించారు. గ్రామాల్లో మహిళలు ఎంతోకాలంగా పొదుపు గ్రూపులను ప్రశాంతంగా నిర్వహించుకుంటున్నారని.. వారి మధ్య తగాదాలకు తావిచ్చేలా వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు. అందుకు ఏపీఎం సమాధానం ఇస్తూ గ్రూపుల్లోని లీడర్లను మార్చాలని ఫిర్యాదులు వచ్చాయని వివరణ ఇచ్చారు. అంతలోనే కలగచేసుకున్న ఎంపీపీ గ్రామాల్లో ఎవరి ఫిర్యాదు మేరకు చేస్తున్నారు, రాత పూర్వకంగా ఏమైనా ఫిర్యాదులుంటే చూపాలని కోరారు. వ్యక్తిగతంగా ఇలాంటి మార్పులు చేపట్టడం మంచిది కాదని, కనీసం గ్రామాల్లోని పొదుపు సంఘాల వారికి తెలియకుండా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం చేస్తున్నానని, ఇందులో తన సొంత నిర్ణయం ఏ మాత్రం లేదని తెలిపారు. అనంతరం సెల్‌ఫోన్‌లో మాట్లాడుకుంటూ బయటకు వెళ్లిపోయారు. ఇక చేసేది లేక మండల అధికారులు ఒక్కొక్కరిగా ఆయా శాఖల వారీగా ప్రస్తుతం నిర్వహిస్తున్న పనులను వివరించారు. వర్షాకాలం కావడంతో గ్రామాల్లో చేయాల్సిన పనులకు కూడా పంచాయతీల్లో నిధులు మంజూరు చేస్తే బాగుంటుందని సర్పంచ్ కోటేశ్వరరెడ్డి కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు జగదీశ్వరమ్మ, ఉపమండలాధ్యక్షులు జనార్దన్‌రెడ్డి, రాజు, ఎంపీడీఓ నాగఅనసూయ, వైద్యులు, మండల అధికారులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని నిరసన



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ అన్నారు. బుధవారం నూనెపల్లె నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు ఎక్కువైనా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. 77, 84, 85, 107, 108, 117 జీవోలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని.. నాడు-నేడు పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు అనుగుణంగా కాస్మోటిక్ చార్జీలను పెంచాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే సీఎం కార్యాలయాన్ని ముట్టడించడానికి సిద్ధమని హెచ్చరించారు. అనంతరం డీఆర్‌ఓ పద్మజకు వినతిపత్రం అందజేశారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పవన్, రాంబాబు, దస్తగిరి, వినయ్, మహేష్ పాల్గొన్నారు.